



చంద్రన్నా.. సుఖీభవ

క్షీరాభిషేకంతో రైతుల ఆశీర్వాదం

- అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ అమలుతో హర్షం
- జిల్లా రైతుల ఖాతాల్లోకి రూ.180.87 కోట్లు జమ

చంద్రబాబు రైతు పక్షపాతి..

సీఎం చంద్రబాబు రైతు పక్షపాతి. రైతుల కష్టాలను తీరుస్తున్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము రైతుల ఖాతాలో జమ అవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను సీఎం నెరవేరుస్తారు. వైఎస్ జగన్ రాయలసీమ ద్రోహి. ఆయన అసమర్థ పాలన కారణంగా సీమ సాగునీటి ప్రాజెక్టులు మూలాన పడ్డాయి. జైలుపాలైన అసాంఘిక శక్తులను పరామర్శిస్తూ, ప్రజలను రెచ్చగొడుతున్నారు.

-సవిత, బీసీ సంక్షేమశాఖ మంత్రి



ఒక్కొక్కటిగా అమలు..

వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి 20 ఏళ్ల వెనక్కు వెళ్లింది. ఎన్నో పరిశ్రమలు వెనక్కు వెళ్లాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్రాన్ని బాగు చేయడం చంద్రబాబుకే సాధ్యమని ప్రజలు కూటమికి అధికారం ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలవుతున్నాయి. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ అమలయ్యాయి. అన్నదాత సుఖీభవ తొలివిడత సొమ్ము జమ చేశాం. ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతుంది. యువతకు నిరుద్యోగ భృతి త్వరలోనే అందుతుంది.

- హిందూపురంలో ఎంపీ బీకే పార్థసారథి

పుట్టపర్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటల సాగుకు ఉపయోగపడేలా రైతుల ఖాతాలో 'అన్నదాత సుఖీభవ' సొమ్ము శనివారం జమ అయింది. జిల్లాలోని 32 మండలాల పరిధిలో 2,65,040 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.132.52 కోట్లు జమ చేసింది. ఇదే సమయంలో పీఎం కిసాన్ పథకం కింద 2,41,774 మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో రూ.48.35 కోట్లు జమ చేసింది. రెండు పథకాల ద్వారా ఒక్కో రైతు ఖాతాలో రూ.7 వేలు చొప్పున మొత్తం రూ.180.87 కోట్లు జమ అయ్యాయి. దీంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమైంది. ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలో మరొకటి నేరవేరింది. దీంతో రైతులు, టీడీపీ కూటమి నాయకులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. రైతు బాంధవుడు చంద్రబాబు అని కొనియాడారు.



కనగానపల్లిలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ చెక్కును రైతులకు అందజేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, రాప్తాడు ఎమ్మెల్యే సునీత



'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకాల అమలు కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరిగింది. రెండు పథకాల ద్వారా తొలి విడతగా ఒక్కో రైతుకు రూ.7 వేలు అందింది. పెనుకొండలో రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పాల్గొన్నారు. పెనుకొండ నియోజకవర్గం రైతులకు మెగా చెక్కును అందజేశారు. కనగానపల్లి మండల వ్యవసాయ కార్యాలయంలో కలెక్టర్ టీఎస్ చేతన్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఆర్డీఓ మహేష్ పాల్గొని రైతులకు మెగా చెక్కును అందజేశారు. హిందూపురంలో ఎంపీ బీకే పార్థసారథి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, మార్కెట్ యార్డు చైర్మెన్ అశ్వత్థనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ రమేష్ పాల్గొన్నారు. కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. ధర్మవరం మార్కెట్ యార్డులో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మార్కెట్ యార్డు చెర్‌పర్సన్ అంబటి అరుణశ్రీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. బత్తలపల్లి మండలం పోట్లమర్రిలో టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. మడకశిరలో రైతు సేవాకేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని పెడబల్లిలో డీసీఎంఎస్ చైర్మెన్ నెట్టెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పుట్టపర్తి హనుమాన్ సర్కిల్‌లో టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పండుగ వాతావరణంలో..

బ్యాంకుల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలి

- ఎస్పీ రత్న సూచన

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న



పుట్టపర్తిరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల వద్ద అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. బ్యాంకుల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. బ్యాంకుల్లో చోరీలు, దోపిడీలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాంకు పరిసర ప్రాంతాలన్నీ స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలు బిగించుకోవాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఏటీఎం, బ్యాంకులను తనిఖీ చేయడతోపాటు గస్తీ ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులందరూ తమ స్టేషన్ పరిధిలోని బ్యాంకులను సందర్శించి, సెక్యూరిటీ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై బ్యాంకు అధికారులతో మాట్లాడాలని ఎస్పీ ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ విజయ్ కుమార్, ఎల్డీఎం రమణకుమార్, వివిధ బ్యాంకుల రీజినల్ మేనేజర్లు రమేష్, శశిధర్, ముఖర్జీ, డీసీఆర్బీ సైబర్ సీఐలు, మోహన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అయ్యో.. దేవుడా..

- మధురైలో రోడ్డు ప్రమాదం
- ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు బీటెక్ విద్యార్థుల దుర్మరణం
- బాధిత కుటుంబాల్లో విషాదం

7

బళ్లారి రాఘవ జీవితం

యువతకు ఆదర్శం: కలెక్టర్



రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నాటకరంగ మహనీయుడైన బళ్లారి రాఘవ జీవితం నేటి యువతకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం బళ్లారి రాఘవ 145 జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడు తూ తెలుగునాటక రంగానికి బళ్లారి రాఘవ చేసిన సేవ అజరామరం అన్నారు. ఆయన నటుడిగానే కాకుండా, సమాజ మార్పునకు కృషి చేసిన గొప్ప కళాకారుడన్నారు. వక్తగా, దాతగా, రచయితగా, ఆయన పేరు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన రాఘవ తన అభినయం, వాక్చాతుర్యంతో ప్రేక్షులను మంత్ర ముగ్ధులను చేశారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏఓ వెంకటనారాయణ పాల్గొన్నారు.

అక్రమార్కులను రక్షించేందుకేనా..?

- ఉపాధి హామీ అక్రమాలపై విచారణలో జాప్యం
- ఆధారాలు ఉన్నా చర్యలు లేకపోవడంపై ఆరోపణలు



అమడగూరు మండలంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక(ఫైల్)

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై విచారణలో జాప్యం జరుగుతోంది. అక్రమార్కులను రక్షించడానికే అధికారులు విచారణలో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని పలుప్రాంతాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై గత నెల 22న తమ్ముళ్ల ఏమిటదన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అధికార పార్టీ నాయకులు, కన్వీనర్లు, మాజీ ఎంపీటీసీ, సర్పంచ్, లాయర్లు, రేషన్ డీలర్లకు అడ్డదిడ్డంగా బిల్లులు చేసిన విషయం విదితమే. ఆరోపణలు రావడంతో వాస్తవాలు నిగ్గు తెల్చడానికి ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. అయితే విచారణను ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేస్తూ, అక్రమార్కులను రక్షించేందుకు యత్నిస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పదిరోజులకు పైగా విచారణ పేరుతో కాలయాపన చేస్తుండటంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉపాధి పనులకు వెళ్లకున్నా, వెళ్లినట్లు వందలాది దొంగ మస్టర్లతో ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లు బిల్లులు చేశారు. దీనిలో అధిక భాగం అధికారులు ముక్కు పిండి వసూలు చేసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే అడ్డదిడ్డంగా బిల్లులు చేసి, అవినీతికి పాల్పడ్డవారు తాము ఏదోవిధంగా బయట పడతామనే ధీమాలో ఉన్నారు. ఉపాధి సిబ్బంది నుంచి లబ్ధిపొందిన నాయకులు కూడా అక్రమార్కులను రక్షించడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

ఆధారాలున్నా...

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకంజ వేస్తుండటం విమర్శలకు దారి తీస్తుంది. విచారణ పేరుతో సాగదీస్తూ, అధికారులే వారిని వెనుకేసుకొస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలకు పాల్పడ్డ వారితో తీసుకున్న డబ్బుకు న్యాయం చేయడానికే అధికారులు ఈవిధంగా చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

షోకాజ్ నోటీసులిచ్చాం



జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. దొంగమస్టర్ల దందాపై పలువురు ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లకు సమాధానం చెప్పాలని షోకాజ్ నోటీసులు జారీ చేశాం. వారి నుంచి వచ్చిన సంజాయిషీని బట్టి చర్యలు తీసుకుంటాం. తప్పు చేసిన ఎవరని ఉపేక్షించం. - విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ

పూల రైతుకు ధరల కటాక్షం..!

6



35 కాదు.. 30 కిలోలే..!

- రేషన్ షాపులో మోసం
- డీలర్‌ను నిలదీసిన లబ్ధిదారులు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- డీలర్‌షిప్ తొలగింపు



బియ్యం తక్కువగా వేయడంతో రేషన్ షాపులో వాగ్వాదం చేస్తున్న కార్డుదారుడు

ధర్మవరం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.యర్రగుంటపల్లిలోని రేషన్ షాపులో 35 కిలోల బియ్యం వేయాల్సి ఉండగా.. 30 కిలోలే పంపిణీ చేయడంతో లబ్ధిదారులు శనివారం నిలదీశారు. భావన పేరుమీద డీలర్‌షిప్ ఉండగా.. నామినీగా చెన్నారెడ్డి నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం రేషన్ బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు వెళ్లారు. అక్కడ 35 కిలోల కార్డుకు 30 కిలోలే బియ్యం ఇవ్వడంతో వారు నిలదీశారు. 5 కిలోలు తక్కువగా వేయడం ఏంటని గట్టిగా అడిగారు. చెన్నారెడ్డి వారితో వాదనకు దిగాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయింది. వెంటనే జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి, సీఎస్‌డీటీ చెన్నకేశవనాయుడు కలిసి విచారణ చేపట్టారు. గ్రామానికి వెళ్లి ఇంతవరకు ఎన్నిక్వింటాళ్లు, ఎంతమందికి పంపిణీ చేశారు, స్టాకు వివరాలను పరిశీలించారు. గ్రామస్థులతో విచారణ చేపట్టారు.

డీలర్‌షిప్ తొలగింపు

కార్డుదారులకు రేషన్ బియ్యం 35 కిలోలకుగాను 30 కిలోలే ఇవ్వడంతో గ్రామస్థులు నిలదీసిన ఘటన వీడియో వైరల్‌కావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. వెంటనే ఆ డీలర్‌ను తొలగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో డీలర్ చెన్నారెడ్డి.. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి స్వచ్ఛందంగా తాను డీలర్‌షిప్ నుంచి వైదొలుగుతున్నట్లు తహసీల్దార్ సురేష్‌బాబుకు లేఖను అందించారు. దీంతో తహసీల్దార్ సురేష్‌బాబు.. డీలర్‌షిప్‌ను రద్దుచేసి ప్రజలకు రేషన్‌బియ్యం పంపిణీ చేసే బాధ్యతను రావులచెరువు వీఆర్‌ఏ కేశవకు అప్పజెప్పారు. వెంటనే కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆకట్టుకున్న ప్రేమతత్వం నాటిక



నృత్యం చేస్తున్న బాలవికాస్ విద్యార్థులు

పుట్టపర్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ చిన్నారులు సత్యసాయి ప్రేమతత్వంపై ప్రదర్శించిన నాటిక భక్తులను అలరింపచేసింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతు సభామండపంలో శనివారం సాయంత్రం యూరప్ దేశాల బాలవికాస్ చిన్నారులు నాటికను ప్రదర్శించారు. పురాణాల్లోని ఘట్టాలు, సత్యసాయి ప్రేమతత్వంపై నాటిక, నృత్య ప్రదర్శన చేపట్టారు. అనంతరం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

పూల రైతుకు ధరల కటాక్షం..!

శ్రావణం రాకతో రెట్టింపైన రేట్లు
అన్నదాతకు లాభాలు
నిలకడగా కొనసాగుతాయని ఆశాభావం



కదిరి మార్కెట్‌లో పూల విక్రయాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బంతిపూలు

కదిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పూల రైతులకు ఆనందం మోసుకొచ్చింది. నిన్నమొన్నటి వరకు నేలచూపులు చేసిన పూల ధరలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. ఈ నెలలో పండుగలు, వరలక్ష్మీ వ్రతాలు, పెళ్లిళ్ల ఇతర శుభ కార్యాలయాలు అధికంగా ఉండడంతో పూలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో ధరలు రెట్టింపయ్యాయి. కొన్నింటి రేట్లు అంతకుమించి పెరిగాయి. కార్తీక మాసం వరకు నిలకడగా ఉంటాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రెట్టింపైన ధరలు

నాలుగు నెలలుగా పూల ధరలు భారీగా తగ్గిపోయాయి. ఎండాకాలం, నీరు సమృద్ధిగా లేక పంట దిగుబడి కూడా అంతంత మాత్రమే వచ్చింది. కొంతమంది రైతులు పూలకు ధరలేక పంటను తొలగించారు కూడా. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో పూల ధరలు పెరుగుతున్నాయి. ఇప్పటికే దాదాపు రెట్టింపయ్యాయి. పండుగలకుతోడు పెళ్లిళ్ల ఇతర శుభకార్యాలు ఉండడంతో ధరలు నిలకడగా ఉంటాయని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. కనకాంబరం ధర కిలో ఇటీవలి వరకు రూ.250కి దాటలేదు. శ్రావణ మాసం రాకతో కిలో రూ.600 పలుకుతోంది. ఇటీవలి వరకు రూ.250కిలోపే పలికిన మల్లెపూలు ప్రస్తుతం రూ.350 నుంచి 400 వరకు పలుకుతున్నాయి. బంతి పూల ధర కూడా దాదాపు రెట్టింపయింది. కిలో బంతిపూల ధర గతంలో రూ.30 నుంచి రూ.40 వరకు ఉండేది. ప్రస్తుతం రూ.70 నుంచి రూ.80 వరకు పలుకుతోంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. దసరాకు రూ.వందకి చేరుతుందని వ్యాపారులు చెబుతున్నారు. గులాబీల ధర కూడా రూ.50 వరకు పెరిగిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

రైతుల్లో ఆనందం

కదిరి ప్రాంతంలో ముఖ్యంగా తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, ఓబుళదేవరచెరువు, అమడగూరు, తలుపుల, కదిరి రూరల్ ప్రాంతాల్లో పూల సాగు ఎక్కువగా ఉంటుంది. నీటి వసతిని బట్టి 25 సెంట్ల నుంచి ఎకరాల విస్తీర్ణంలో పంట పెడతారు. కనకాంబరం వివిధ మండలాల్లో ఎకరా నుంచి రెండు ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ఈ మూడేళ్ల వరకు ఉంటుంది. నిన్నమొన్నటి వరకు ధరలు లేకపోవడంతో గిట్టుబాటు కాదని కొందరు రైతులు పంటను తొలగించుకున్నారు. పంటను అలాగే ఉంచున్న రైతులు ప్రస్తుతం సంబరపడుతున్నారు. ధరలు పెరగడంతో వారికి లాభాల పంట పండుతోంది.

నష్టపోయింది లేదు..



పదేళ్లుగా కనకాంబరం సాగుచేస్తున్నా. అరెకరాలో నాలుగు విడతలుగా పంట పెడతా. రోజూ పూలను కదిరి మార్కెట్‌కు తరలిస్తున్నా. తద్వారా వచ్చే డబ్బుతో ఇంటి అవసరాలు తీరిపోతాయి. పూలతోటలసాగులో నష్టపోయింది లేదు. ప్రస్తుతం కనకాంబరం కిలో రూ.600 పలుకుతోంది. తద్వారా లాభాలు వస్తున్నాయి.

- సుధాకర్, రైతు, చిన్నరామన్నగారిపల్లి

లాభాలు వస్తున్నాయి



ఎకరాలో బంతి పూలు సాగు చేశా. శ్రావణ మాసం రాకతో ధరలు బాగున్నాయి. గతంలో కిలో రూ.30 పలికేవి. ప్రస్తుతం పూల నాణ్యతను బట్టి రూ.70నుంచి రూ.100 వరకు పలుకుతున్నాయి. ఎకరాలో పంట సాగుకు రూ.50వేలకుపైగా ఖర్చు చేశాం. మూడురోజులకోసారి 250 కేజీల దిగుబడి వస్తోంది. ధరలు బాగుండడంతో లాభాలు వస్తున్నాయి.

- రాఘవరెడ్డి, రైతు, కటారుపల్లి క్రాస్

నిరసిద్దాం రండి: వామపక్షాలు

- విద్యుత్ చార్జీలపై పార్టీలకు అతీతంగా ఉద్యమించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష నాయకులు
- 5న విద్యుత్ కార్యాలయాల వద్ద ప్రజాసంఘాల నిరసన



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

అనంతపురం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల దోపిడీని ఆపాలంటూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 5న చేపట్టనున్న నిరసనకు మద్దతిస్తున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు వెల్లడించారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు నాగరాజు, ఎస్‌యూసీఐసీ రాఘవేంద్రలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే చార్జీలు పెంచమని చెప్పిన ప్రస్తుత పాలకులు కూడా అదనపు చార్జీలు కొనసాగించడం బాధాకరమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ ప్రభుత్వ ఖర్చులు పెంచి ప్రజల నుంచి విద్యుత్ సర్దుబాటు చార్జీలు వసూలు చేయడం అన్యాయమన్నారు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో వాడుకున్న కరెంటుకు బిల్లులు కట్టినా మళ్లీ అదనంగా రూ.15,485కోట్లు సర్దుబాటు చార్జీలను ప్రజలపై మోపారన్నారు. అదానీ కంపెనీ రాష్ట్రంలోని రెండుకోట్ల మంది వినియోగదారుల పాత మీటర్లు తొలగించి, కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తోందన్నారు. విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చేస్తున్న కుట్రలో భాగమే ఇది అని పేర్కొన్నారు. ఎస్‌యూసీఐసీ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర మాట్లాడుతూ ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు(ఎఫ్‌ఏపీపీసీ) చార్జీల విధానాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఐదో తేదీన విద్యుత్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద చేపట్టే నిరసనలకు పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజారెడ్డి, శ్రీరాములు, లింగమయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, రామాంజనేయులు, నాగమణి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ వీరనారప్ప, సీపీఐఎంఎం, ఎస్‌యూసీఐసీ కమిటీల నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్



అధికారుల బాగోతం

- ప్రతి నెలా రూ.35 వేలు డ్రా
- రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల దర్జా

సొంతకార్లకు అద్దె వసూలు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కొందరు తహసీల్దార్ల కక్కుర్తితో రెవెన్యూశాఖ పరువు పోతోంది. ప్రతి నెలా అద్దె కారు కోసం ప్రభుత్వం చెల్లించే డబ్బు కోసం కొందరు తహసీల్దార్లు నిబంధనలకు నీళ్లొదిలి వ్యవహరిస్తున్నారు. అద్దె కార్లు కాకుండా సొంతకార్లే వాడుతూ బిల్లులు చేసుకుంటున్నారు. కుటుంబసభ్యులు, బంధువులు, బినామీల పేర్లతో కార్లు తీసుకుని వాడుకుంటున్నారు. ఎల్లో బోర్డున్న ఇతర కార్ల నంబర్లు పెట్టి ప్రతి నెలా రూ.35వేల బిల్లు డ్రా చేసుకుంటున్నట్లు సమాచారం. వీరిలో చాలామంది సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటున్నా రు. మరికొందరు డ్రైవర్లపై ఆధారపడుతున్నారు. అంటే డ్రైవర్లున్నవారికి రూ.15వేల వరకు ఖర్చు వస్తుంది, లేని వారికి అది కూడా మిగిలిపోతుంది. మరి కొందరు ఘనులు నౌకర్లనే కారు డ్రైవర్లుగా వాడేస్తున్నారట. దీంతో ప్రభుత్వం అందజేసే మొత్తం రూ.35వేలు నేరుగా ఖాతాలో పడిపోతుంది. ఈ కార్ల బాగోతం శాఖలోని కొందరు ఉన్నతాధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

రెవెన్యూ అధికారులు సొంత కార్లు ఉపయోగించడం వల్ల రెండు నష్టాలున్నాయి. అధికారులకు ప్రభుత్వం నుంచి ప్రతి నెలా రూ.35వేలు కారు సౌకర్యం కోసం ప్రభుత్వం నిధులు ఇస్తోంది. కానీ అధికారులు దుర్వినియోగం చేస్తున్నారు. ఏదైనా అద్దె కారు తీసుకుంటే సంబంధిత వాహన డ్రైవర్‌కు ఉపాధి కల్పించినవారవుతారు. దీంతో కొంతవరకు నిరుద్యోగ సమస్య తీరే పరిస్థితి ఉంది. ఎల్లోబోర్డు వాహనం ఉన్నవారు లైఫ్ ట్యాక్స్ కింద ప్రభుత్వానికి రూ.80వేలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుంది. అయితే అధికారులు వైట్ బోర్డున్న సొంత వాహనాలు వాడుతుండటం వల్ల ప్రజలు, ప్రభుత్వానికి నష్టం కలుగుతోంది.

వీఆర్‌ఓలు, ఆర్‌ఐలదే పెట్రోల్, డీజిల్ బాధ్యత



రెవెన్యూ అధికారులు దర్జాగా ప్రతి నెలా డబ్బు గడించడమే కాకుండా కారుకు డీజిల్, పెట్రోల్ కూడా ఉచితంగానే పొందుతున్నట్లు తెలిసింది. ఏదైనా భూమి విషయంలో పని చేసి పెట్టినందుకు కొందరు పెట్రోల్, డీజిల్ పట్టిస్తుంటారని సమాచారం. ఎక్కువ మండలాల్లో వీఆర్‌ఓలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్‌ఐ)ల సహకారంతో పెట్రోల్, డీజిల్ పట్టిస్తున్న ట్లు తెలిసింది. పక్కన ఆదాయం పొందడంలో బిజీగా ఉండే వీఆర్‌ఓలు, ఆర్‌ఐలు తుది సంతకాల కోసం తహసీల్దార్లతోనే పని ఎక్కువగా ఉంటుంది. దీంతో తమ అధికారికి ఇలా డీజిల్, పెట్రోల్ పోయించడంతో పాటు కొన్ని ప్రొటోకాల్ వ్యవహారాల్లో అక్రమంగా సంపాదించిన సొమ్ములో కొంత ఖర్చు పెడుతుంటారని తెలిసింది.

విచారించి.. చర్యలు తీసుకుంటాం



జిల్లాలో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు వైట్ బోర్డులున్న వాహనాలే వాడుతున్నట్లు నా దృష్టికి రాలేదు. వైట్ బోర్డులు ఉపయోగించి ఎల్లో బోర్డున్న వాహనాల నంబర్లతో బిల్లు పెట్టుకోవడం సరైంది కాదు. జిల్లాలో అందరూ చేస్తున్నారా, లేక కొందరేనా అనేది విచారించి చర్యలు తీసుకుంటాం.

- మలోల, డీఆర్‌ఓ

కానిస్టేబుళ్లుగా 'వదాన్య' విద్యార్థులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఫలితాల్లో వదాన్య జనా సొసైటీ సంస్థ విద్యార్థులు సత్తా చాటారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నలుగురు విద్యార్థులు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపియ్యారు. ఈ సందర్భంగా వదాన్య సంస్థ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి విద్యార్థులను శనివారం అభినందించి మాట్లాడారు. తమ సంస్థ తరఫున ప్రతిభావంతులైన నిరుపేద, నిరాశ్రయ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా హాస్టల్ ఫీజులు, స్టైఫండ్, ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్నామని తెలిపారు. పోటీపరీక్షల నోటిఫికేషన్‌లకు అనుగుణంగా ప్రతిభాపరీక్షలు నిర్వహించి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. అన్నిరకాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.



కానిస్టేబుళ్లుగా ఎంపికైన వదాన్య విద్యార్థులు

మార్పు కోసం తపించిన మహనీయుడు బళ్లారి రాఘవ

- కళాకారుల నివాళి
- రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డుల ప్రదానం



రాష్ట్ర, జిల్లాస్థాయి బళ్లారి రాఘవ అవార్డులు అందుకున్న కళాకారులు



అనంతపురం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పు కోసం బళ్లారి రాఘవ పరితపించారని వక్తలు కొనియాడారు. దీని కోసం ఆయన రంగస్థలాన్ని వేదికగా చేసుకున్నారని అన్నారు. అనేక పౌరాణిక, సాంఘిక నాటకాలలో ఆయన జీవించారని అన్నారు. బళ్లారి రాఘవ 145వ జయంతిని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని లలిత కళా పరిషత్ ఆవరణలో శనివారం సాయంత్రం 'బళ్లారి రాఘవ' అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది గాజుల పద్మజ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డీఆర్వో మలోల, టౌన్ ప్లానింగ్ ఏడీ సువర్ణ తదితరులు హాజరై బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 2025 సంవత్సరానికి మేరిగె రామలింగేశ్వరరావు(తెనాలి), భూపతి ధర్మారావు(రేపల్లె, గుంటూరు జిల్లా)కు రాష్ట్రస్థాయి బళ్లారి రాఘవ అవార్డును అందజేసి సత్కరించారు. పౌరాణిక నాటక కళాకారులు వాల్మీకి కుళ్లాయప్ప, మల్లెల జయరామ్‌కు జిల్లాస్థాయి బళ్లారి రాఘవ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం 'గోవు మా లచ్చిమి' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. కళాకారులు వెంకటరామిరెడ్డి, అరుణ్‌బాబు, ఎస్‌యం బాషా, జ్యోతిరాణి తమదైన శైలిలో నటించి మెప్పించారు. కార్యక్రమంలో లలితకళా పరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద్ సాగర్, వడ్డెర సంఘం నాయకుడు రాజేష్, నారాయణస్వామి, వెంకట సుబ్బయ్య, భగవాన్, రంగప్ప, రఘు, అస్లాంబాషా, లోకేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రవాణా వ్యవస్థ మెరుగుకు కేంద్రం చర్యలు

పుట్టపర్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రవాణా వ్యవస్థను మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. ఈక్రమంలోనే రాష్ట్రంలో వివిధ జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి జాతీయ రహదారులు, రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ శనివారం పాల్గొన్నారు. మంగళగిరి నుంచి వర్చువల్‌గా ఈ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ముదిగుబ్బలోని ఎన్‌హెచ్-42 రోడ్డు 8 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.22 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించారు. కదిరి రైల్వే క్రాసింగ్ ఆర్‌ఓబీ నిర్మాణం రెండు కిలోమీటర్లకు రూ.65 కోట్లు ఖర్చు చేసి, ఆధునికీకరించి జాతికి అంకితమివ్వనున్నట్లు వారు ప్రకటించారు. వీటి నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్య తగ్గి, రోడ్డుప్రమాదాల నియంత్రణ జరుగుతుంది. అలాగే పర్యాటకానికి ప్రోత్సాహం పెరిగి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా వేగవంతం అవుతుంది.

రైతుల సేవకే ప్రాధాన్యం

- రూ.30 కోట్ల టర్నోవర్ సాధిస్తాం
- డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్



నెట్టెం వెంకటేష్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో రైతుల సేవకే అధిక ప్రాధాన్యం ఇస్తామని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ నెట్టెం వెంకటేష్ తెలిపారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నెట్టెం వెంకటేష్ 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలు వెల్లడించారు.

ప్రశ్న : ఉమ్మడి అనంత జిల్లాలో డీసీఎంఎస్ బ్రాంచ్‌లు ఎన్ని ఉన్నాయి...?

జవాబు : అనంతపురం ప్రధాన కార్యాలయంతో పాటు ఒక బ్రాంచ్, తాడిపత్రి, కదిరి, హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, కళ్యాణదుర్గంలో ఉన్నాయి.

ప్రశ్న : కొత్త బ్రాంచ్‌లు ప్రారంభించే అవకాశం ఉందా..?

జవాబు : త్వరలో పుట్లూరు మండలం కడవకల్లులో బ్రాంచ్ ప్రారంభిస్తాం. నియోజకవర్గానికి ఒక బ్రాంచ్ ఏర్పాటుపై అధ్యయనం చేస్తున్నాం.

ప్రశ్న : డీసీఎంఎస్ వార్షిక టర్నోవర్ ఎంత..?

జవాబు : వార్షిక టర్నోవర్ ప్రస్తుతం రూ.24కోట్లుగా ఉంది. దీనిని రూ.30 కోట్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రశ్న : డీసీఎంఎస్ ద్వారా రైతులకు ఏవిధమైన సేవలు అందిస్తున్నారు...?

జవాబు : రైతులకు ఎరువులు, మందులు, నిత్యావసర సరుకులు బహిరంగ మార్కెట్‌కంటే తక్కువకు అందిస్తున్నాం. ఆధునిక వ్యవసాయ యంత్రాలను తక్కువ ధరకే అందుబాటులో ఉంచాం.

ప్రశ్న : కొత్తగా ఏవైనా కార్యక్రమాలు చేపడుతున్నారా..?

జవాబు : డీసీఎంఎస్ ద్వారా సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీలకు నిత్యావసర సరుకులు, ప్రభుత్వ కార్యాలయాలకు స్టేషనరీ సరఫరా.. దీపావళికి టపాసుల అమ్మకాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే వెంటనే ప్రారంభిస్తాం.

ప్రశ్న : డీసీఎంఎస్‌కు ఉమ్మడి జిల్లాలో ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయి...?

జవాబు : అనంతపురం ప్రధాన కార్యాలయంలో సుమారు 20వరకు షాపులు, గోడౌన్లు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఆర్‌ఎఫ్ రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. గుత్తి రోడ్డులో మూడు ఎకరాల స్థలంలో షాపులకు అద్దెకిచ్చాం. తాడిపత్రి, కదిరి, హిందూపురం, కళ్యాణదుర్గంలో షాపులు అద్దెకు ఇచ్చాం. డీసీఎంఎస్‌కు చెందిన ఆస్తులను పరిరక్షిస్తూ, ఆదాయం పెంచడపై ప్రత్యేక దృష్టి సారించాం.

ప్రశ్న : సొసైటీల ద్వారా ఎలాంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు...?

జవాబు : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీల ద్వారా రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగమైన డ్రోన్‌లు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

బోధనపై దృష్టి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు అడుగులు

- పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
- జిల్లా, మండలస్థాయిల్లో అకడమిక్ ఫోరం కమిటీలు
- 15 రోజులకోసారి రాష్ట్ర కమిటీ సమీక్ష
- జిల్లాలో అమలుకు కుస్తీ

అనంతపురం విద్య, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతికంగా బోధన వసతులు కల్పిస్తోంది. పలు పథకాలు, సౌకర్యాల కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతోంది. అయినా విద్యాప్రమాణాలు మాత్రం ఆశించిన స్థాయిలో మెరుగుపడట్లేదు. కేంద్రం నుంచి వచ్చిన రెండు సంస్థల సర్వేల్లో ఈ విషయం స్పష్టమైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లల సామర్థ్యాలు అనుకున్న స్థాయిలో లేవని ఆ సంస్థలు తేల్చాయి. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో సగం మందికి కూడికలు, తీసివేతలు కూడా రావడంలేదని, ఇంగ్లిష్ పదాలు చదవలేకపోతున్నారని నివేదికలు ఇచ్చాయి. పథకాలు అమలు చేస్తున్నా, సౌకర్యాలు కల్పిస్తున్నా.. విద్యాప్రమాణాలు ఎందుకు మెరుగు పడట్లేదన్న దానిపై మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖల అధికారులు దృష్టి పెట్టారు. మెరుగు పరిచే దిశగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అమలు చేయనున్నారు. ఆ దిశగా అకడమిక్ ఫోరం కమిటీలను నియమించి, పర్యవేక్షించాలని నిర్ణయించారు. కమిటీలను సైతం నియమించారు. కమిటీల పనితీరు, విద్యా ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న చర్యలపై 15 రోజులకోసారి రాష్ట్రస్థాయిలో సమీక్షించనున్నారు.

అకడమిక్ ఫోరం కమిటీలు

విద్యాప్రమాణాల పెంపు పర్యవేక్షణకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం జిల్లా, మండలస్థాయిల్లో అకడమిక్ ఫోరం కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో డీఈఓ చైర్మన్‌గా సమగ్రశిక్ష ఏపీసీ, ఏసీ, డీసీఈబీ కార్యదర్శి, ముగ్గురు ఎంఈఓలు సభ్యులుగా ఉంటారు. ప్రతి సబ్జెక్టుకు నలుగురు నిపుణులైన స్కూల్ అసిస్టెంట్లు చొప్పున 24 మంది టీచర్లను, ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5వ తరగతి వరకు పర్యవేక్షణకు జిల్లాస్థాయి కమిటీలో నలుగురు ఎస్జీటీ కేడర్‌లో నిపుణులైన టీచర్లకు అవకాశం కల్పించారు. మండలస్థాయిలోనూ నిరంతరం పర్యవేక్షణకు ఎంఈఓ-1, ఎంఈఓ-2, కాంప్లెక్స్ హెచ్‌ఎం, ముగ్గురు ఎస్జీ టీచర్లకు కమిటీలో అవకాశం కల్పించారు. జిల్లా కమిటీ సభ్యులు బృందాలుగా పాఠశాలలను పర్యవేక్షిస్తారు. విద్యార్థుల సామర్థ్యాలు, ప్రమాణాల పెంపునకు ఎలా బోధిస్తున్నారు, ఎన్‌రోల్‌మెంట్, పిల్లలు, టీచర్ల హాజరు, పాఠశాలలకు వచ్చిన నిధులు, వాటితో ఎలాంటి వసతులు కల్పించారు, డబ్బు ఎలా ఖర్చుపెట్టారు తదితరాలను పరిశీలిస్తారు. తనిఖీ చేసిన పాఠశాలలోని పరిస్థితులను కమిటీ రాసుకోవాల్సి ఉంటుంది. 15 రోజులకోసారి అకడమిక్ ఫోరం కమిటీలతో రాష్ట్రస్థాయిలో మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ సమీక్ష నిర్వహిస్తారు. కమిటీల పనితీరు, గుర్తించిన సమస్యలపై ఆరా తీస్తారు. ఆ దిశగా ఇప్పటికే కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలో అమలుకు అధికారులు కుస్తీ పడుతున్నారు.



ఎఫ్‌ఎల్‌ఎన్ ప్యానల్‌తో పాఠం చెబుతున్న టీచర్

కమిటీలతో నిత్యం పర్యవేక్షణ



ప్రభుత్వ పాఠశాలల్లో బోధన పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయిల్లో అకడమిక్ ఫోరంకమిటీలు ఏర్పాటు చేశాం. జిల్లా కమిటీని సైతం నియమించాం. విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసయాదవ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. పరిశ్రమల శాఖ కార్యాలయంలో శనివారం ఆయన సబ్సిడీ లకు సంబంధించి పలు వివరాలను వెల్లడించారు. పెట్టుబడి సబ్సిడీ కింద ఓసీ జనరల్‌కు 25 శాతం రాయితీ ఉందన్నారు. విద్యుత్‌కు సంబంధించి యూనిట్‌కు రూ.1 మంజూరు చేస్తారన్నారు. వంద శాతం సేల్స్ ట్యాక్స్ రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. స్పెషల్ కేటగిరి కింద ఓసీ మహిళతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు పెట్టుబడి రాయితీ 45 శాతం ఇస్తామన్నారు. విద్యుత్‌ను యూనిట్‌కు రూ.1.5 ప్రకారం కేటాయిస్తామన్నారు. సేల్స్ ట్యాక్స్ మాత్రం అందరికి ఒకే విధంగా 100 రాయితీ ఇస్తారన్నారు.

క్రైం కార్నర్

219 గంజాయి చాక్లెట్ల పట్టివేత



పట్టుబడిన నిందితుడితో పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 219 గంజాయి చాక్లెట్లను త్రీటౌన్, ఈగల్ సెల్, జీఆర్పీ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా అరికట్టడంలో భాగంగా ఉదయం తనిఖీలు నిర్వహించారు. త్రీటౌన్, ఈగల్ సెల్, గవర్నమెంట్ రైల్వే పోలీసుల సంయుక్తంగా తనిఖీలు చేశారు. అనంతపురం నుంచి ధర్మవరం వెళ్లే 18463 నంబర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ఉదయం 6.20 గంటలకే తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఒడిసాకు చెందిన సాల్మాన్ అనే ప్రయాణికుడి వద్ద గంజాయి పదార్థం ఉన్న 219 చాక్లెట్లు గుర్తించి, పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూటర్ డిక్కీలోని నగదు చోరీ



నగదు దోచుకెళ్లిన అనుమానితులు

కదిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్కూటర్ డిక్కీలో పెట్టిన రూ.70వేల నగదును దొంగలు అపహరించారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుటాగుళ్లకు చెందిన ఇమాంఖాన్, సమీర్‌ఖాన్ శనివారం కరూర్ వైశ్యాబ్యాంకు నుంచి రూ.70వేలు నగదు డ్రా చేశారు. డబ్బును స్కూటర్ డిక్కీలో పెట్టుకుని బైపాస్ రోడ్డులోని మోర్ దుకాణం వదకు చేరుకున్నారు. అక్కడ ఆపి మెకానిక్ వద్దకెళ్లారు. బ్యాంకు వద్ద నుంచి వారిని బైక్‌లో ఫాలో అయిన ఇద్దరు దుండగులు ఇదే అదునుగా భావించి, డిక్కీలోని నగదు అపహరించుకు వెళ్లారు. మెకానిక్ షాపు నుంచి బయటకు వచ్చిన ఇమాంఖాన్, సమీర్‌ఖాన్ డిక్కీలో చూసుకోగా.. నగదు కనిపించలేదు. చోరీ అయినట్లు గ్రహించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. డబ్బు కొట్టేసిన ఇద్దరికి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీని విడుదల చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

అమరాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలదపల్లికి చెందిన కెంచమ్మ(59) అప్పుల బాధ భరించలేక శనివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కెంచమ్మ భర్త గతంలోనే మరణించాడు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం, కుటుంబ అవసరాల నిమిత్తం రూ.4లక్షలు పైబడి అప్పు చేసింది. వాటిని తీర్చేందుకు కుమారుడు బెంగళూరుకు కూలి పనుల కోసం వెళ్లాడు. దీంతో కెంచమ్మ ఒంటరిగా ఉంటుండేది. ఈ నేపథ్యంలో అప్పుల వారి బాధలు అధికమవడంతో శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చింత చెట్టుకు ఉరేసుకుని మరణించింది. అటుగా వెళ్లిన వారు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని మడకశిరకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

పనిచేసిన పాలకేంద్రాన్నే కొల్లగొట్టారు

- జనరేటర్, క్యాన్లు చోరీ
- ముగ్గురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేఖర్, చిత్రంలో ఎస్ఐ రాంబాబు

అనంతపురం క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తాము పనిచేసిన పాల కేంద్రం మూతపడడంతో రోడ్డునపడిన వారు అందులోని సామగ్రిపై కన్నేసి, కొల్లగొట్టారు. పోలీసులకు పట్టుబడి కటకటాల పాలయ్యారు. మూతపడిన పాలకేంద్రంలో చోరీ కేసులో ముగ్గురు నిందితులను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10 లక్షల విలువైన జనరేటర్, 70 అల్యూమినియం పాల క్యాన్లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో నిందితుల అరెస్టు వివరాలను అనంతపురం రూరల్ సీఐ శేఖర్.. ఎస్ఐ రాంబాబుతో కలిసి శనివారం వెల్లడించారు. నగరంలోని రంగస్వామి నగర్‌కు చెందిన షేక్షావలి (31) తపోవనంలో డీజే లైటింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతడికి అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలం పాత మొలకల చెరువుకు చెందిన గోవిందు సింహాద్రి (24), హిందూపురం పట్టణంలోని డీఆర్ కాలనీకి చెందిన మనోహర్ (35) స్నేహితులు. గోవిందు సింహాద్రి, మనోహర్ గతంలో కొర్రపాడు, రాచానపల్లిలోని ప్రభుత్వ పాల కేంద్రాల్లో పనిచేశారు. అవి మూతపడడంతో వీరిరువురు రోడ్డున పడ్డారు. ఈ నేపథ్యంలో షేక్షావలికి తన డీజే షాపులోకి జనరేటర్ అవసరమైంది. ముగ్గురూ కలిసి ప్లాన్ వేశారు. గతనెల 14న రాచానపల్లిలోని పాలకేంద్రంలో ఉన్న 25 కేవీఏ సామర్థ్యంగల జనరేటర్, 70 పాలక్యాన్లను చోరీ చేసి, రెండు వాహనాల్లో తరలించారు. వాటిని విక్రయించేందుకు తరలిస్తుండగా.. పోలీసులకు సమాచారం రావడంతో దాడి చేసి, తపోవనం వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపాన ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి జనరేటర్, పాల క్యాన్లు, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

కదిరిఅర్బన్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): స్థానిక పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీ కోసం ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయన్నారు. పది ఉత్తీర్ణులైన వారు 4వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 5వ తేదీన ఉదయం కళాశాలలో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

బంటు భుజాలపై భగవంతుడు

కసాపురంలో హనుమద్ వాహనంపై ఊరేగిన సీతారాములు



ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



హనుమద్ వాహనంపై సీతారాములు

గుంతకల్లుటౌన్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): పరమ భక్తుడు, బంటు అయిన నెట్టికంటి ఆంజనేయస్వామి భుజాలపై సీతాదేవి సమేతంగా రామచంద్రమూర్తి విహరించారు. శ్రావణ శనివారం సందర్భంగా మండలంలోని కసాపురంలో ఆలయ ప్రాకారోత్సవం కనులపండువగా సాగింది. శ్రీసీతారామచంద్రస్వామి సహిత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు నిర్వహించారు. హనుమద్ వాహనంపై కొలువు దీర్చి, ఆలయ ప్రాకారోత్సవాన్ని మేళతాళాల మధ్య గావించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు తులసీ దళాల అలంకరణ



బొమ్మనహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామికి లక్ష తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం స్వామివారిని గంగాజలంతో అభిషేకించి, పూజలు చేశారు. పంచామృతాభిషేకం, విష్ణుపారాయణం, అష్టోత్తర నామావళి గావించారు. తులసీ దళాలతో స్వామివారి మూలవిరాట్‌ను అలంకరించి, నైవేద్యం సమర్పించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు.. స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు.. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి పూజలు నిర్వహించారు. నేమకల్లు క్రాస్ నుంచి భక్తుల కోసం బొమ్మనహాళ్‌కు చెందిన వెంకటేశ్వరరావు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు.

మురడికి పోటెత్తిన భక్తులు



దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

డీ.హీరేహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురడి ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంలో ప్రధాన అర్చకులు, సిబ్బంది తెల్లవారుజామునే సుప్రభాత సేవ, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి పూలు, ఆభరణాలతో ప్ర త్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు.. కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా722 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటాలు గరిష్టంగా రూ.40తో అమ్ముడుపోయాయి. కనిష్ఠంగా రూ.24, సరసరి ధర రూ.32తో విక్రయాలు జరిగాయన్నారు. మొత్తంగా మార్కెట్‌కు 3,450 టన్నుల టమోటాలు వచ్చాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

రిజర్వాయర్‌కు 2,170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2170 క్యూసెక్కులు ఉన్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఇక్కడి నుంచి ఔట్‌ఫ్లో 2130 క్యూసెక్కులు వెళుతున్నాయని, ప్రస్తుతం రిజర్వాయరులో 1.784 టీఎంసీల నీటి నిల్వ వుందని అధికారులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అనంతపురం క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యాడికి మండలం రాయలచెరువుకు చెందిన బలపం రాయి వ్యాపారి వెంకటరమణ నాయుడు(43) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అనంతపురం రూరల్ పోలీసులు శనివారం తెలిపిన మేరకు వెంకటరమణ తన వ్యాపారం నిమిత్తం శుక్రవారం అనంతపురం వచ్చాడు. పనికాకపోవడంతో మరో పని మీద రాత్రి 10 గంటలప్పుడు కాటిగానికాల్వకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి ఒంటిగంట సమీపంలో బీజేపీ కాలనీ ఆర్చ్ సమీపంలో కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జర్మనీలో నర్సు ఉద్యోగావకాశాలు

కదిరి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ చేసినవారికి జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నాగార్జున శనివారం ప్రకటనలో తెలిపారు. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చేసినవారికి జర్మన్ భాష నేర్పించి, ఆ దేశంలో నర్సులుగా ఉద్యోగావశాకాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అసక్తి ఉన్నవారు 9390176421 నంబరులో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్ల పనిచేస్తున్న టీచర్లు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కిష్టప్ప శనివారం ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులను అందజేస్తోందన్నారు. దరఖాస్తులను ఈనెల 8వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఉప విద్యాశాఖాధికారి, మండల విద్యాశాఖాధికారికి మూడు సెట్లు చొప్పున అందజేయాల్సి ఉంటుందన్నారు.

నిబంధనలు ఇవీ..

- కనీసం 10 సంవత్సరాల బోధనానుభవం కలిగి ఉండాలి
- జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి.
- రాష్ట్రస్థాయిలో ఇదివరకే అవార్డు తీసుకున్న వారు అనర్హులు.
- దరఖాస్తుదారులపై క్రిమినల్ కేసులు ఉండరాదు. శాఖాపరతమైన క్రమశిక్షణ చర్యలు ఉన్నవారు అనర్హులు.
- జాతీయ అవార్డుకు దరఖాస్తు చేసిన వారు కూడా అనర్హులు.

దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శి పోస్టుకు జిల్లాలో ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్ పాఠశాలలు, కాలేజీల్లో పనిచేస్తున్న పీఈటీలు, పీడీలు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కిష్టప్ప శనివారం ప్రకటనలో తెలిపారు. 58 సంవత్సరాలలోపు వయసు, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో నేటి సాయంత్రంలోపు అందజేయాలన్నారు. వివరాలకు డీఈఓ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.

గొల్లపల్లికి వస్తే చాలు..!

- 15 రోజుల్లో మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీటి విడుదల
- లైనింగ్ పూర్తయితే 2వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం



మడకశిర బ్రాంచ్ కెనాల్

పెనుకొండ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి నుంచి గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీరు వచ్చిన తక్షణం మడకశిర బ్రాంచ్ కాలువకు విడుదల చేసేందుకు హెచ్ఎన్ఎస్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నీటి సామర్థ్యం 1.92టీఎంసీలుకాగా ప్రస్తుతం 1.2టీఎంసీల నీటి నిల్వ ఉంది. 15రోజుల్లోగా మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తామని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు. కాగా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులను రూ.4కోట్లతో చేయనున్నట్లు సంబంధిత అధికారలుఉ తెలిపారు. గతంలో ఈ కెనాల్ ద్వారా హిందూపురం, మడకశిర నియోజకవర్గాలలోని చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా వెయ్యి నుంచి 1200క్యూసెక్కుల నీరు సరఫరా అయ్యేది. లైనింగ్ పనులు పూర్తయితే గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా 2వేల క్యూసెక్కుల నీరు సరఫరా అవుతుందని హెచ్ఎన్ఎస్ అధికారులు చెబుతున్నారు. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని చెరువుల చివరి ఆయకట్టు వరకు నీరు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.



కొత్తపల్లి వద్ద కొనసాగుతున్న హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు

అయ్యో.. దేవుడా..!

- మధురైలో రోడ్డు ప్రమాదం
- ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు బీటెక్ విద్యార్థుల దుర్మరణం
- బాధిత కుటుంబాల్లో విషాదం

కుందుర్పి/ముదిగుబ్బ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆ ఇళ్ల ఆశాదీపాలను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. అంతులేని శోకం మిగిల్చింది. తమిళనాడులోని మధురైలో శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో ఉమ్మడి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థులు రోహిత్ (22), కార్తీక్ (22) దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఒక్కగానొక్క కుమారుడు..

కుందుర్పి మండలంలోని మాయదార్లపల్లికి చెందిన వలస మూర్తి, రూప దంపతులకు కుమార్తెలు మేఘన, ఐశ్వర్య, కుమారుడు రోహిత్ ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఒక్కగానొక్క కుమారుడిని ఉన్నత చదువులు చదివించాలన్న ఉద్దేశంతో మధురై జిల్లాలోని కలసలింగం యూనివర్సిటీలో బీటెక్ చదివిస్తున్నారు. అదే కాలేజీలో ముదిగుబ్బలోని నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన శ్రీనివాసులు, లీలావతి దంపతుల కుమారుడు కార్తీక్ చదువుతున్నాడు. ఇద్దరూ బీటెక్ మూడో సంవత్సరం చదువుతుండేవారు. శుక్రవారం సాయంత్రం కాలేజీ ముగించుకుని, హాస్టల్‌కు ఇద్దరూ బైక్‌పై బయల్దేరారు. ప్రమాదవశాత్తు బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. వెంటనే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, ఐడీ కార్డు ఆధారంగా సమీప యూనివర్సిటీకి సమాచారాన్ని అందించారు. కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. వెంటనే మధురైకి తరలి వెళ్లారు. కార్తీక్‌కు అన్న ఉన్నాడు. సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.



కార్తీక్, రోహిత్ (ఫైల్)

పంటల బీమా గడువు పొడిగింపు

- బ్యాంక్‌లో రుణం తీసుకోని రైతులకు ఈనెల 14 వరకు..
- రుణం తీసుకున్న రైతులకు నెలాఖరు దాకా అవకాశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఫసల్ బీమా, వాతావరణ బీమా ప్రీమియం చెల్లింపు గడువును పొడిగించారు. బీమా సంకటం శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గడువు పొడిగింపు అంశంపై ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఇందుకు జిల్లా వ్యవసాయ యంత్రాంగం స్పందించి ప్రధాన పంటలు ఆగస్టు నెలలో సాగయ్యే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఫసల్ బీమా, వాతావరణ బీమా కోసం ప్రీమియం చెల్లించే గడువును పొడిగించాలని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు లేఖ రాశారు. వారు ఈ విష యాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్లడంతో గడువు పొడిగింపు ఉత్త ర్వులు వచ్చాయి. ఫసల్ బీమా యోజన కింద కంది, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరప పంటలకు జూలై 31, వరి పంటకు ఈనెల 15వతేదీ వరకు ప్రీమియం చెల్లించేందుకు గడువు ఉండింది. అలాగే వాతావరణ ఆధారిత బీమా కింద వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు ప్రీమియం చెల్లించేందుకు ఇదివరకు జూలై 15వతేదీ వరకే గడువు విధించారు. తాజాగా ఫసల్ బీమా, వాతావరణ బీమా కోసం బ్యాంక్‌లో రుణం తీసుకోని రైతులకు ఈనెల 14దాకా, రుణం తీసుకున్న రైతులకు ఈనెలాఖరు దాకా ప్రీమియం చెల్లించేందుకు గడువు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు.

రైతులను నిర్లక్ష్యం చేసిన పాలకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

గుంతకల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కేవలం రూ.ఏడు వేల ఆర్థిక సాయాన్ని అందజేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యం చేశాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఉదయం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాభావంతో రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతులు పట్టి కరువును ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో 8.58 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగాల్సి ఉండగా, 3.01 లక్షల ఎకరాల్లో మాత్రమే విత్తనం పడిందన్నారు. మిగతా భూములు బీళ్లుగా దర్శనమిస్తున్నాయన్నారు. డబుల్ ఇంజన్ సర్కారుగా చెప్పుకునే పాలకులు రైతులకు రూ. ఏడు వేలు విదిల్చి, వారిని బిచ్చగాళ్లలాగా చూశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం హంద్రీనీవాను వైడెనింగ్ చేయడం అభినందనీయమే కానీ పిల్ల కాలువలను పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. పట్టిసీమ పూర్తయితే రాయలసీమకు నీరు వస్తుందన్నారని, అది సాధ్యపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్టు విషయంలోనూ ఆ మాటలే చెబుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపి, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

బయటికి వెళ్లాక మార్పురావాలి

- ఖైదీలకు జిల్లా న్యాయాధికారి సూచన



జైలు అధికారితో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి భీమరావు

హిందూపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జైలు నుంచి బయటికి వెళ్లాక ఖైదీల ప్రవర్తనలో మార్పురావాలని ఉమ్మడి జిల్లా న్యాయాధికారి భీమరావు సూచించారు. స్థానిక సబ్‌జైలును శనివారం ఆయన తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న భోజనాలపై ఆరాతీశారు. కొంతమంది ఖైదీలు వారి సాధక బాధకాలను న్యాయాధికారికి వివరించారు. అరెస్ట్ చేసినప్పుడు పోలీసులు వేధిస్తే న్యాయాధికారికి చెప్పాలన్నారు. అనంతరం స్థానిక సీనియర్ సివిల్ కోర్టు సమీపంలో నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట ఏడీజే కంపల్లె శైలజ, జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు ఆధార్ శిబిరాలు



విద్యార్థితో ఆధార్ నమోదు చేయిస్తున్న డీడీ శ్రీనివాసరావు, మొబైల్ బృందం

అనంతపురం విద్య, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఆధార్ నమోదు చేసుకోని జిల్లాలోని గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేంగా మొబైల్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ శాఖ జిల్లా కేంద్రంలో శనివారం ఆధార్ శిబిరాన్ని డీడీ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపు 30 శాతం మంది గిరిజన విద్యార్థులకు ఆధార్ సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ ఆధార్ నమోదు చేయించి, ప్రభుత్వ పథకాలు అందజేసే దిశగా మొబైల్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందం జిల్లాలోని అన్ని మండలాల్లో శిబిరాలు నిర్వహిస్తుందన్నారు. గిరిజన విద్యార్థులతో ఆధార్ నమోదు చేయించాలని వారి తల్లిదండ్రులకు డీడీ సూచించారు.

న్యూస్ బాక్స్

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



త్రివర్ణపతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

ధర్మవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను పట్టణంలోని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాక విశిష్టతను విద్యార్థినులకు వివరించారు. 40 అడుగుల త్రివర్ణపతాకంతో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, అధ్యాపకులు పాల్గొన్నారు. పట్టణంలోని రిషి విద్యాలయ పాఠశాలలో పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ కరుణ్‌స్వరూప్‌సింగ్, పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, సీఈఓ రవీంద్ర, వైస్‌ప్రిన్సిపల్ కల్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళకు కుట్టుమిషన్ అందజేత

కొత్తచెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఖిద్మత్-ఎ-ఖల్క్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నాగిరెడ్డిపల్లి కాలనీలో నివాసముంటున్న ఒంటరి మహిళ హుస్సేన్‌బీకి సీఐ మారుతీశంకర్ చేతులమీదుగా శనివారం కుట్టుమిషన్‌ను అందజేశారు. ఆమె కుటుంబ పోషణ నిమిత్తం అందజేసినట్లు తెలిపారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి'

ధర్మవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తామని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ పట్టణ నూతన అధ్యక్షుడు మోహన్‌కృష్ణ తెలిపారు. ఏపీఎంటీఎఫ్ వ్యవస్థాపకుడు రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సిద్దిగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పట్టణ కమిటీని ఎంపికచేశారు. అధ్యక్షుడిగా మోహన్‌కృష్ణ, ఆర్థిక కార్యదర్శిగా వెంకటేశ్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎంపికచేశారు.

చోరీలపై జాగ్రత్త: సీఐ

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చోరీలపై బ్యాంకు మేనేజర్లు అప్రమత్తంగా ఉండాలని సీఐ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం పోలీస్ స్టేషన్‌లో బ్యాంక్ మేనేజర్లు, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి బ్యాంకులో 24గంటలు సీసీటీవీలు అందుబాటులో ఉంచాలన్నారు. పలు సూచనలు చేశారు. అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, ఏడీ ఓబులేసు, ఏఈ గౌరీశంకర్ పాల్గొన్నారు.

చేనేత దినోత్సవం ఏర్పాట్ల పరిశీలన

ధర్మవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆగస్టు 7వ తేదీన నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవానికి కదిరిగేటు వద్ద చేస్తున్న ఏర్పాట్లను హ్యాండ్‌లూమ్ ఏఈ రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరవుతున్నారని హరీశ్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి సాకే ఓబులేశు, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర, నాయకులు పోతుకుంట రాజు, వీరనారప్ప, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

'నేతన్న నేస్తం' అమలు చేయాలి

ధర్మవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకాన్ని వెంటనే అమలుచేయాలని ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. వారు శనివారం పట్టణం లోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... ఎన్నికల హామీలలో భాగంగా ఆగస్టు 7న చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నందుకు సీఎం చంద్రబాబునాయుడు, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఓబీసీ విద్యార్థి సంఘం వెబ్‌సైట్ ప్రారంభం

కదిరి అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం వైబ్‌సైట్‌ను శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పట్టణంలోని తన నివాసంలో ప్రారంభించారు. కులంలో వెనుకబాటు తనం ఉండవచ్చుకానీ.. బీసీ విద్యార్థుల సమస్యల సాధనకు కృషి చేయాలన్నారు. బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు - కేసు నమోదు

ధర్మవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తన భర్త తరచూ వేధింపులకు గురిచేస్తున్నాడని పట్టణంలోని కొత్తపేటకు చెందిన జింకా శ్రీదేవి ఫిర్యాదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. కొత్తపేటకు చెందిన జింకా శ్రీదేవికు పదకొండేళ్ల క్రితం తాడిపత్రికి చెందిన జింకా రామ్‌కుమార్‌తో ఇచ్చి వివాహం చేశారు. వివాహకై ఏడాది వరకు వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తరువాత భార్యపై అనుమానంతో రామ్‌కుమార్ ప్రతి చిన్న విషయానికి మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసేవాడు. అదేవిధంగా విడాకు లు ఇవ్వాలని వేధించేవాడు. ఈ విషయాన్ని శ్రీదేవి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ చేసినా రామ్‌కుమార్‌లో ఎటువంటి మార్పు రాలేదు. భర్త వేధింపులు తట్టుకోలేక జింకా శ్రీదేవి పుట్టినిల్లు ధర్మవరానికి వచ్చింది. అయినా గత నెల 27న భర్త రామ్‌కుమార్ ధర్మవరానికి వచ్చి నానా దుర్భాషలాడి కొట్టి గాయపరిచాడు. దీంతో ఆమె శనివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ధర్మవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న టన్ను (1000కేజీలు) పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. పట్టణంలోని కదిరిగేటు ప్రాంతానికి చెందిన అక్రం అనే వ్యక్తి లగేజీ ఆటోలో టన్ను పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నామన్నారు. బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, రామకృష్ణను అరెస్టు చేసినట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

కదిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కందికుంట నారాయణమ్మకాలనీ వైపు రైల్వే ట్రాక్ వద్ద ఉన్న మామిడి తోటలో శనివారం పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసినట్లు సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. అందిన సమాచారం సిబ్బంది దాడులు చేసి పదిమందిని అరెస్టు చేశారన్నారు. రూ.7,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

● గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లి పంచాయతీ గొల్లపల్లి పరిసర ప్రాంతాల్లో శనివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ట్రైనీ ఎస్‌ఐ రవి కుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేసి, పేకాట ఆడుతున్న నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.4,330నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు జమేదార్ గంగాధర్ తెలిపారు.

ఘనంగా శ్రావణమాస పూజలు



పాలపాటిదిన్నెలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

నల్లచెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామికి శ్రావణమాసం రెండో శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. అర్చకులు మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం సందర్భంగా ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. వాల్మీకి పాఠశాల అధినేతలు పవన్‌కుమార్ రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి ఉచిత అన్నదానం నిర్వహించారు. ఎస్‌ఐ మగ్బుల్‌బాషా ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

● నల్లమాడ/గాండ్లపెంట: నల్లమాడ మండలపరిధిలోని పెద్దకోట్లపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి, గాండ్ల పెంట మండలంలోని మునగలవారిపల్లి గరుడాంజనేయస్వామికి శ్రావణ మాసం రెండో శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆకుపూజతో పాటు, ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

● కదిరి: తలుపుల మండలంలోని బత్రేపల్లిలో బస్టాండ్ ఆవరణలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అన్నదానం చేశారు.





అలంకరణలో పెద్దకోట్లపల్లి ఆంజనేయస్వామి, మునగలవారిపల్లి గరుడాంజనేయస్వామి

రైతుల ఆనందమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కందికుంట



అన్నదాత సుఖీభవ చెక్కును విడుల చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించే రైతుల ముఖాల్లో ఆనందం, వారి కుటుంబాల్లో సంతోషం కలుగజేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ కింద నియోజకవర్గానికి మంజూరైన రూ. 30కోట్ల చెక్కును ఆయన శనివారం స్థానిక వ్య వసాయ పరిశోధన కేంద్రంలో విడుద చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తమ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమన్నారు. రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఇక్కడి చెరువులు నింపకుండనే సరాసరి పీలేరుకు నీరు తరలించిందని, అయితే తమ ప్రభుత్వం ఈ ప్రాంతంలో చెరువులను నింపిన తరువాతే తరలించారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాదున్నీషా, టీడీపీ పరిశీలకుడు వాజీద్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకురాలు పర్వీనా బాను, బాహద్దీన్, కొమ్మినేని గంగయ్యనాయుడు, జనసేన భైరవప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం: చిలకం

● ధర్మవరం రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ విడుదల కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మార్కెట్ యార్డులో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన టీవీ లైవ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు ప్రసంగాలను రైతులతో కలిసి బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు వీక్షించారు. నియోజకవర్గానికి సంబంధించి 38,933 మంది రైతులకు రూ.26.57 కోట్లు రైతులకు జమకానుందని, అందుకు సంబంధిం చి మెగా చెక్కును బీజేపీ నాయకులు హరీష్‌బాబు, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ అంబటి అరుణశ్రీతో కలిసి చిలకం మధుసూదన్ రెడ్డి విడుదల చేశారు. తహసీల్దార్ సురేష్‌బాబు, వ్యవసాయ అధికారులు, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి సాకే ఓబిలేసు, మండల కన్వీనర్ గొట్లూరు చంద్ర, అంగజాల రాజు, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, మా ర్కెట్‌యార్డు డైరెక్టర్లు రాఘవ రెడ్డి, ఆజాద్‌బాబు పాల్గొన్నారు.

● పుట్టపర్తిరూరల్: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదటి విడత సొమ్మును రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు సూచించారు. నియోజకవర్గ పరిధిలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదటివిడత పంపిణీ కార్యక్రమాన్ని శనివారం మండలపరిధిలోని పెడపల్లిలో సర్పంచ్ మంగ్లీబాయి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశ్వర్లు, డీఏఓ సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ శివప్రసాద్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శుభదాసు, సింగిల్‌విండో అధ్యక్షుడు విజయకుమార్ నియోజకవర్గంలోని 44348 మంది రైతులకు మంజూరైన రూ. 30,37,96,000 మెగా చెక్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు విక్రం, ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి, వెంగళమ్మచెరువు సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాంనాయక్, నాయకులు బొమ్మయ్య, పీఏసీఎస్ డైరక్టర్లు కుళ్ళాయప్ప, తిప్పేనాయక్ పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



ధర్మవరంలో మెగా చెక్కును విడుదల చేస్తున్న జనసేన, బీజేపీ నాయకులు



పెడపల్లిలో మెగాచెక్కును విడుదల చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్, డీఏఓ తదితరులు

పీఎం, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



ఓబుళదేవరచెరువులో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం నిధులు, పీఎం కిసాన్ సొమ్ము మంజూరు చేయడంపై బీజేపీ మండలాధ్యక్షులు వీరాంజ నేయులు ఆధ్వర్యంలో శనివారం మండలకేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, అశ్వత్థప్ప, వెంకటరమణ, సురేష్, సోమశేఖర్, కిష్టప్ప, చలపతి, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.



● ముదిగుబ్బ: అన్నదాత సుఖీభవ పథకం నిధులను శనివారం రైతుల ఖాతాల్లోకి జమ చేయడంతో మండల కేంద్రంలోని నాలుగో సచివాలయంలో రైతులు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, నాయకులు తుమ్మల సూరి, అన్నమనేని ఆనంద్, గోపాల్, వెంకటపతి, శీనా, రాఘవ, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



● పుట్టపర్తి రూరల్: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పుట్టినరోజున అన్నదాత సుఖీభవ కార్యక్రమం అమలు కావడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని టీడీపీ మండల కన్వీనర్ బోయ రామాంజినేయులు, నాయకులు సామకోటి ఆదినారాయణ, నాయకులు చెన్న కేశవులు, పిట్టా ఓబుళరెడ్డి, కొత్తచెరువు మండల నాయకులు సా లక్కగారి శ్రీనివాసులు, వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, శ్రీరామిరెతడ్డి, విజయ్‌కుమార్, ముమ్మనేని వెంకటరాముడు, గోపాల్‌రెడ్డి, అప్పస్వామినాయుడు, శంకరప్ప, బీజేపీ నాయకులు శరత్ కుమార్‌రెడ్డి, ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

రైతుల అభివృద్ధికి సీఎం కృషి: పరిటాల శ్రీరామ్



పీఎం, సీఎం, డీసీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న శ్రీరామ్

బత్తలపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు నిత్య పరితపిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మండలపరిధిలోని పోట్లమర్రి, సంజీవపురం గ్రామాల్లో శనివారం 'మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. పోట్లమర్రిలో పరిటాల శ్రీరామ్ హాజరై సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతులు ఎంతో కష్టపడి పంటలు పండిస్తారని అన్నారు. అలాంటి రైతు కుటుంబం నుంచి వచ్చిన సీఎం చంద్రబాబు రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు పరితపిస్తున్నారని అన్నారు. నియోజకవర్గానికి అన్నదాత సుఖీభవ మొదటి విడత కింద 37,903 మంది రైతులకు రూ. 26.56లక్షలు విడుదల చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ మొదటి విడత కింద రూ.2 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. అనంతరం పీఎం మోదీ, సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పరిటాల శ్రీరామ్ రైతులతో కలసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు జక్కంపూటి నాగభూషణ, పురుషోత్తం చౌదరి, రమణ, అశోక్, అప్పస్వామి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● ధర్మవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేస్తామని టీడీపీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూర్ హుస్సేన్, నాయకుడు చట్టా లక్ష్మీనా రాయణ పేర్కొన్నారు. పట్టణంలోని 16,14వ వార్డుల్లో 'మీ సమస్య-మాబాధ్యత' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రజల నుంచి విన తులు స్వీకరించారు. నాయకులు రాళ్లపల్లి షరీఫ్, చింతపులుసు పెద్ద న్న, అం బటి సతీశ్, జింకా పురుషోత్తం, కరెంటు ఆది, అస్లాం, కిరోసన్ పోతల య్య, భాస్కర్‌చౌదరి, దాసరి శీన, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● తాడిమర్రి: మండలంలోని శివంపల్లి, మోదులకుంట, మద్దెలచెరువు గ్రామాలలో శనివారం మీ సమస్యామా బాధ్యత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుండి సమస్యలతో కూడి అర్జీలను స్వీకరించారు. వాటిని సమస్య వారిగా వేరుచేసుకుని వాటిని అధికారులకు అందజేసి పరిష్కరించేవిదంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచి రామ్మోహన్, శ్రీనివాస రెడ్డి, సాయి, హర్ష, పక్కీర్‌రెడ్డి, రంగయ్య, కుళ్లాయరెడ్డి, పాపపానాయుడు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రజలందరికీ న్యాయం చేసేందుకే జాగృతి కమిటీ

● న్యాయాధికారి వెంకటేశ్వర్లు

ధర్మవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో న్యాయం చేకూర్చడమే జాగృతి కమిటీ లక్ష్యమని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. న్యాయాధికారి శనివారం స్థానిక కోర్టు చాంబర్‌లో జాగృతి కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. జాగృతి కమిటీ నిర్వహించాల్సిన విధివిధానాలను వివరించారు. అదేవిధంగా ఎవరికైన స మస్య వస్తే టోల్ ఫ్రీ నంబరు 15100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌బాబు, న్యాయవాదులు బాల సుందరి, బిల్లే రవీంద్ర, ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



ధర్మవరంలో మాట్లాడుతున్న న్యాయాధికారి వెంకటేశ్వర్లు

● కదిరి లీగల్: న్యాయ చట్టాల పట్ల ప్రజలను చైతన్య పరిచేందుకు జాగృతి అనే ప్రక్రియ ప్రారంభమైందని న్యాయ అను సంధాన కర్తలు అభిప్రాయపడ్డారు. న్యాయఫలాలను మారుమూల ప్రజల చైతన్యం కోసం పార దర్శకంగా చేరవేసే ప్రక్రియను జన జాగృతి కార్యాలయంలో శనివారం ప్రారంభించారు. సదస్సులో సంధాన కర్త లోకేశ్వర్ రెడ్డి, జన జాగృతి శ్రీనివాసులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు. ఉన్నత న్యాయవ్యవస్థ ఆదేశానుసారం జాగృతి ప్రక్రియను, ప్రత్యేకించి మహిళా చైతన్యం కోసం ముందుకు తీసుకువెళ్తామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



సామూహిక ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న మహిళలు

ధర్మవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక ఏడు శనివారాల వ్రతాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాలుగో శనివారం నిర్వహించారు. అర్చకులు రాజేశ్ స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 40మంది మహిళలు సామూహిక ఏడు శనివారాల వ్రతాన్ని చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, ప్రధానకార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, సభ్యులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నంశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

అన్నదాతల అభివృద్ధే సీఎం ధ్యేయం

● ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల ఆనందం, అభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఎల్లప్పుడు అనందంగా ఉండాలని కోరుకునే సీఎం చంద్రబాబు ఆరోగ్యంగా నిండునూరేళ్లు జీవించాలని, మరో 20 ఏళ్లు రాష్ట్రంలో సుపరిపాలన అందించాలని వెంకటేశ్వరస్వామిని వేడుకున్నానని పేర్కొన్నారు. ఎన్నికల హామీమేరకు రైతుల ఖాతాల్లో మొదటి విడతగా అన్నదాత- సుఖీభవ, పీఎంకిసాన్ సొమ్మును జమచేయడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని 44348 మంది రైతులకు రూ 30.37కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసినట్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కొత్తచెరువులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కొత్తచెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో శనావారం టీడీపీ పట్టణ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు ఇంటి వద్ద ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ... ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చిన్న వయస్సులో ఎమ్మెల్యేగా గెలుపొందినా, నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వాణీ శ్రీనివాస్, నాయకులు నాగేంద్రప్రసాద్, జేసీబీ చలం, హరిప్రసాద్, జయరాం పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న సొసైటీ చైర్మన్ ముమ్మనేని వెంకటరాముడు

● పుట్టపర్తి: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం ఎదుట చైర్మన్ ముమ్మనేని వెంకటరాముడు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో వెంగళమ్మ చెరువు సొసైటి సంఘం చైర్మన్ శ్రీరామిరెడ్డి, కౌన్సిలర్ ఊరువాకిలి రత్నప్పచౌదరి, కోనంకిగంగాధర్, గంగిరెడ్డి, డీలర్ సూరి, పుల్లప్ప, నారాయణప్ప, పుట్ల గంగాద్రి, రామప్ప పాల్గొన్నారు.

6,896 మందికి అన్నదాత సుఖీభవ

తాడిమర్రి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని 6,896 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.744.8 లక్షలు, 6819 మందికి పీఎం కిసాన్ కింద రూ.136.38లక్షలు మొత్తం రూ.481.18లక్షలు మంజూరైనట్టు ఏఓ శేఖర్‌నాయక్ తెలిపారు. 75 మందికి ఈకేవైసీ సమస్య ఉండటం వల్ల పీఎం కిసాన్ నిధులు మంజూరుకాలేదని ఆయన తెలిపారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

తాడిమర్రి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు రూ. 60 వేలు చేసే పది సీలింగ్ ఫ్యాన్లు, స్పోర్ట్స్ కిట్‌ను శనివారం అందజేశారు. పూర్వ విద్యార్థులు రాజశేఖర్, ఈశ్వరయ్య, రాఘవరెడ్డి, శివయ్య, ప్రతాప్, తేజ టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ నాయకుడు శ్రీనివాసులు చేతుల మీదుగా పాఠ శాల సిబ్బందికి అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారిణులు

ధర్మవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరుగనున్న 15 వ జాతీయస్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారిణులు సింధు, ప్రవిత ఎంపిక య్యారని హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు, సత్యసాయి జిల్లా జనరల్ సెక్రటరీ బంధనాదం సూర్యప్రకాశ్ శనివారం తెలిపారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

న్యూస్ బాక్స్




అలంకరణలో స్వామి, అమ్మవారు

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు

పావగడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పావగడ శనీశ్వరుడు ఆలయంలో రెండో శ్రావణ శనివారం రోజు భక్తులు తరలివచ్చారు. ఉదయం 4 గంటలకే తొలిపూజకు భక్తులు శుక్రవారం రాత్రి నుంచి టిక్కెట్ల కోసం పోటీపడి ఎస్ఎస్‌కే అతిథి గృహానికి చేరుకున్నారు. నవగ్రహపూజ, తైలాభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. నల్లగుడ్డ, నల్లనువ్వులు, సాంబ్రాణి అగ్నిగుండంలో వేసి ప్రదక్షిణ చేసి శనీశ్వరా తమ జోలికి రావద్దు అంటూ తమ వీపు స్వామివారికి చూపించకుండా మొక్కుబడి తీర్చుకున్నారు. శీతలాంబకు కుంకుమార్చన, కంకణాభాగ్యం, తాళిపూజ చేయించి పెళ్లికాని యువతీ యువకులు ప్రత్యేకంగా దర్శనం చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 40వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు, డైరెక్టర్లు తెలిపారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

హిందూపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మిట్టమీదపల్లి వద్ద సీతారామలక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠ శనివారం వైభవంగా సాగింది. గ్రామస్థులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

ఆలయాల్లో శ్రావణ శనివారం పూజలు



పెనుకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం శనివారం పూజలు పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరువాకిలి ఆంజనేయ స్వామి, దక్షిణముఖ ఆంజనేయస్వామి, మిట్ట ఆంజనేయ స్వామి, దర్గా ఆంజనేయ స్వామి, లక్ష్మీ వెంకటరమణ స్వామి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామివారి మూలవిగ్రహాలను వివిధ రకాల పూలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో..



అగళి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో రెండో శ్రావణ శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావుడి ఆంజనేయస్వామి, కోడిపల్లి ఆంజనేయస్వామి, హెచ్‌డిహళ్లి ఆంజనేయస్వామి, అగళి ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఆకు పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

రొళ్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీరిగేపల్లి గ్రామంలో వెలసిన అమ్మాజీ దేవాలయాన్ని శనివారం కర్ణాటక రాష్ట్రం పావగడ మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, రాయుడు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

11వరకు అడ్మిషన్ల గడువు పొడిగింపు

పెనుకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లకు 11వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సుదర్శన్ ఒక ప్రకటన తెలిపారు. 10వ తరగతి పాసై వివిధ కారణాలవల్ల ఇప్పటికీ ఏ కళాశాలలో చేరని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సింగిల్ విండో డైరెక్టర్‌కు సన్మానం

గోరంట్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సింగిల్‌విండో డైరెక్టర్‌గా నియమితుడైన నబీరసూల్‌ను జమియత్‌ఉల్మా కమిటీ సభ్యులు శనివారం సన్మానించారు. టీడీపీ నాయకుడు నబీరసూల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడంతో కమిటీ సభ్యులు ఆయనను కలిసి అభినందించారు. శాలువ, పూలమాలలు, జ్ఞాపకతో సన్మానించారు. అజంతుల్లా, మౌలానాషఫీ, మౌలానా అబ్దులా, ముజీబుర్ రహీమాన్, రియాజ్, మునాఫ్, ముస్తఫా, ముక్తియార్, ఇంజనీర్ అజంతుల్లా, ఆరీఫ్, సైపుల్లా పాల్గొన్నారు.


అంబేడ్కర్ బోర్డు ఏర్పాటుకు చర్యలు

పెనుకొండ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుబవాండ్లపల్లిలో అంబేడ్కర్ బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు కియ ఎస్ఐ రాజేష్ తెలిపారు. కురుబవాండ్లపల్లిలోని బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ బోర్డును కొందరు తొలగించడంతో ప్రజాసంఘాల నాయకులు, దళితులు రాస్తారోకో, ధర్నా చేశారు. శనివారం ఎస్ఐ రాజేష్ కురుబవాండ్లపల్లికి చేరుకుని గ్రామస్థులు, ప్రజాసంఘాలతో సమావేశం ఏర్పాటుచేసి వారికి సర్దిచెప్పారు. అదేస్థానంలో బోర్డును ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు.

బ్యాంకుల వద్ద భద్రత ఏర్పాటు చేయాలి

పెనుకొండ టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరుగుతున్న దొంగతనాలు దృష్ట్యా బ్యాంకుల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటుచేయాలని డీఎస్పీ నర్సింగప్ప సూచించారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బ్యాంక్, ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెనుకొండలో దాదాపు బ్యాంకులతోపాటు ప్రైవేట్ గోల్డ్‌లోన్ ఫైనాన్స్‌లు 14 ఉన్నాయి. రాత్రివేళల్లో సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు.

టీడీపీ జెండా కట్ట ధ్వంసం



ధ్వంసమైన జెండా కట్ట

రొద్దం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకలాపట్నం గ్రామంలో టీడీపీ జెండా కట్టను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. ప్రాథమిక పాఠశాల ఎదురుగా జెండా కట్ట ఉంది. శనివారం ఉదయం గ్రామస్థులు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ఈ పని చేసి ఉంటారని టీడీపీ నాయకులు అనుమానిస్తున్నారు. దీనిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ కాంతప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రాయలసీమ రైతులకు సీఎం అండ

● చేనేత జౌళి శాఖ మంత్రి సవిత



రైతులకు చెక్కు అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): ఆయలసీమ రైతులకు సీఎం చంద్రబాబు అండగా నిలుస్తున్నారని మంత్రి సవిత అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతున్నాయన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పెనుకొండ నియోజకవర్గానికి చెందిన 42,503 రైతులకు పీఎం కిసాన్ 39,062 వీరందరికీ రూ.29.0639కోట్ల చెక్కును మంత్రి సవిత విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుల ఖాతాల్లో నగదు జమ అయిందన్నారు. ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తదితర నాయకులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, గుట్టూరు సూరీ, కన్వీనర్ శ్రీరాములు, ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత అన్నారు. 20ఏళ్లుగా మూతబడిన పీఎస్‌సీసీ పోలు తయారు కేంద్రాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మూడున్నర కోట్లతో జరిగే పోలు తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 1986లో మా తండ్రి ఎస్.రామచంద్రారెడ్డి ఇక్కడ ప్రజల అవసరాలకు పోలుసెంటర్‌ను ప్రారంభించారని, అనివార్య కారణాలవల్ల మూతపడిందన్నారు. ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్, జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పాల్గొన్నారు.

ఇచ్చిన మాట తప్పం



మహిళలకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి

సోమందేపల్లి: ఆర్థిక ఇబ్బందులు ఎన్ని వచ్చినా, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షమందికి వితంతు పించన్లు అందజేస్తున్నామన్నారు. సోమందేపల్లి మండలంలో 130 మందికి 5.5లక్షలు అందించామన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం కింద 67.27లక్షల మందికి పథకాన్ని వర్తింపచేశామన్నారు. సోమందేపల్లిలో రూ.5.75కోట్లతో ఎన్ఆర్‌జీఎస్ కింద రోడ్లు, డ్రైనేజీలు చేపట్టామన్నారు. నీరుగంటి చంద్ర, హరిదాస్, డీవీ ఆంజనేయులు, కన్వీనర్ వెంకటేశులు, సిద్దలింగప్ప, వెంకటరాముడు, సూరి, కిష్టప్ప, ప్రభాకర్, చిన్నబాబయ్య నరసింహులు, సంజీవరెడ్డి, భానుకీర్తి, రామక్రిష్ణ, శ్రీధర్, మద్దిలేటి, గట్టా మహేంద్ర, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, తహసీల్దార్ మారుతి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

రొద్దం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వితంతువులకు నూతన పెన్షన్లను ప్రభుత్వం మంజూరు చేయడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శనివారం గౌరాజుపల్లి, ఎం.కొత్తపల్లి, మోపర్లపల్లి, రొద్దం, కంబాలపల్లి, బీదానిపల్లి గ్రామాల్లో వితంతు పించన్లను అందేశారు. నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, నరసింహులు, చంద్రమౌళి, నరహరి, మాజీ సర్పంచ్ నాగరాజు, వీరాంజి, సిద్దన్న, ఉమాశంకర్ పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన వితంతు పించన్లు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ క్రిష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, జయకుమార్, నరసింహమూర్తి, నవీన్‌కుమార్, గణేష్, గుప్త, రామచంద్రప్ప, తిప్పజ్జ, తిమ్మన్న, దాదాపీర్, మారుతిప్రసాద్ పాల్గొన్నారు.

గోరంట్ల: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన 203 వితంతువులకు కూటమి నాయకులు శనివారం పంపిణీ చేశారు. 20 పంచాయతీల పరిధిలో మంజూరైన లబ్ధిదారులను పిలిపించి పింఛన్ అందించారు. ఎంపీడీఓ నరేంద్రకుమార్, కార్యదర్శులు, కూటమి నాయకులు బాలక్రిష్ణచౌదరి, లక్ష్మీనారాయణ, సంతోష్, సోముశేఖర్, నాగేనాయక్, విద్యాధరణి, శ్రీధర్, జయచంద్ర, సుబ్బారెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.



అమరాపురంలో వితంతు పింఛన్ అందుకున్నవారితో నాయకులు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏడీజే కంపల్లె శైలజ

హిందూపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 13న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసులతో సమావేశమయ్యారు. ఏడీజే మాట్లాడుతూ పరిష్కారమయ్యే కేసులన్నీ లోక్ అదాలత్‌లో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా చెక్‌బౌన్స్, భరణం, బ్యాంక్, సివిల్‌కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. పోలీసులు ముందుగానే ఇరువర్గాల కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లు, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య, ఎస్ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి అశోక్

మడకశిర రూరల్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి అశోక్ కుమార్ సూచించారు. శనివారం ఆమిదాలగింది ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయాధికారి పాల్గొని ప్రసంగించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించండి



ఆర్జేడీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెనుకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఇంటర్ కళాశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నారని, వాటిని నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్, విద్యార్థులు ఆర్జేడీ సురేష్‌బాబుకు, డీఐఈఓ చెన్నకేశవప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో ఆర్జేడీకి వినతిపత్రం ఇస్తూ ఇంటర్మీడియట్ కళాశాల వారు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని వాటిని కట్టడి చేయాలన్నారు. ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత లోపించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజనం చేయడానికి వంటగదిలేక పాఠశాలలోనే వంట చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా వంటగదులు నిర్మించాలని, అర్థాంతరంగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయాలని కోరారు.

నైపుణ్యం పెంచేందుకే పునశ్చరణ తరగతులు

● ఆర్జేడీ సురేష్‌బాబు

పెనుకొండ, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఆర్జేడీ డా.సురేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో జిల్లాస్థాయిలో మ్యాథ్స్ అధ్యాపకులకు పునశ్చరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్జేడీతో పాటు ఇంటర్మీడియట్ విద్యాధికారి చెన్నకేశవప్రసాద్ హాజరయ్యారు. జేడీ మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్లు పెంచాలని, కళాశాలకు చేరని విద్యార్థులకు ప్రభుత్వ పథకాల గురించి తెలిపాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కళాశాలలో చేరి నాణ్యమైన విద్యను పొందాలన్నారు. చెన్నకేశవప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయడంవల్ల గతంలోకంటే అడ్మిషన్లు పెరిగాయన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్, అధ్యాపకులు మూర్తి, రామచంద్రయ్య, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన పుస్తకాలు ఆవిష్కరించారు.



నైపుణ్యాభివృద్ధి పుస్తకాలను విడుదల చేస్తున్న ఆర్జేడీ, అధ్యాపకులు

'తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష'



మాట్లాడుతున్న వైద్యాధికారి అయేషా తస్లీమా

సోమందేపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అని వైద్యాధికారి అయేషా తస్లీమా అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం గర్భవతులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై ఆమె అవగాహన కల్పించారు. పీహెచ్ రవీంద్ర, రత్నమ్మ, పద్మావతి, ఏఎన్‌ఎం కాకిబాయి, ఆశ, నిరోష, అశ్విని, రబియ, గంగరత్న, అంగనవాడీలు శోభారాణి, పద్మ, సరిత, చంద్రకళ పాల్గొన్నారు.

గోరంట్ల: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని సీడీపీఓ శాంతలక్ష్మి సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని వానవోలు గ్రామంలో పలు కార్యక్రమాల్లో శనివారం ఆమె పాల్గొన్నారు. ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప, సూపర్‌వైజర్ నాగరాణి, శివలత, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, శోభా, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలు తాగించాలని సీడీపీఓ ధనలక్ష్మి సూచించారు. శనివారం మండలంలోని మునిమడుగు అంగనవాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగనవాడీ టీచర్ వీణ పాల్గొన్నారు.



గోరంట్లలో మాట్లాడుతున్న సీడీపీఓ శాంతలక్ష్మి



రైతులకు చెక్కును అందజేస్తున్న ఎంపీ, జేసీ, మార్కెట్‌యార్డ్ చైర్మన్

రతనాలసీమగా మార్చడమే ధ్యేయం: ఎంపీ బీకే

హిందూపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాయలసీమను రతనాల సీమగా మార్చడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాతా సుఖీభవ, పీఎంకిసాన్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఎంపీ, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ హాజరయ్యారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ ప్రతిరైతును ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఏడాదికి 20వేలు ప్రభుత్వం ఇస్తోందన్నారు. జేసీ మాట్లాడుతూ రైతులను ఆదుకోవడానికి అన్నదాత సుఖీభవ కార్యక్రమం శ్రీకారం చుట్టారని, ప్రతిరైతు మారిన కాలానుగుణంగా పంటలు మార్చి ఆదాయాన్ని పొందాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 827మంది రైతులకుగాను రూ.14.80కోట్లు చెక్కును ఎంపీ, జేసీ రైతులకు అందజేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్, కార్పొరేషన్ డైరెక్టర్‌లు ఆనంద్, పరిమళ, మాజీ చైర్మన్ అనీల్, పార్టీ కన్వీనర్ వెంకటేశ్, రాము, శ్రీనివాస్, అభిలాష్, నాగరాజు, షఫీ పాల్గొన్నారు.

అన్నదాత కళ్లలో ఆనందం చూడాలన్నదే లక్ష్యం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల



రైతులకు మెగా చెక్‌ను అందజేస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతల కళ్లలో ఆనందం చూడలన్నాదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రైతు సేవా కేంద్రం వద్ద శనివారం అన్నదాతా సుఖీభవ కార్యక్రమాన్ని రైతులతో కలిసి నిర్వహించారు. ఆయన సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు రూ.20 వేలు పెట్టుబడి నిధిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. అందులో భాగాంగా మొదటి విడతగా రూ.7 వేలు రైతు ఖాతాల్లోకి జమ చేశారన్నారు. నియోజకవర్గంలో 43,300 రైతులకు రూ.29.52 కోట్ల మొత్తాన్ని జమ అయ్యిందన్నారు. డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, వ్యవసాయ అధికారి తిమ్మప్ప, తహసీల్దార్ హసీనాసుల్తానా, శ్రీనివాసమూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, మున్సిపల్ చైర్మన్ నరసంహరాజు పాల్గొన్నారు.

గుడిబండ: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ నిధులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయని తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. శనివారం రైతు సేవాకేంద్రం కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌ను అధికారులతో కలిసి తహసీల్దార్ పాల్గొన్నారు. వీరనరేష్, డిప్యూటీ తహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డి, నాయకులు దుర్గేష్, శశిధర్ పాల్గొన్నారు.

గుడిబండ: మండలంలోని కేకేపాళ్యం, తిమ్మాపురం, తాళికెర తదితర గ్రామాల్లో శనివారం వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పించన్లను టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో అందజేశారు. నాయకులు భీమరాజు, జయన్న, రమేష్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

రొళ్ల: అన్నదాతా సుఖీభవ సొమ్మును ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. మండలంలోని గుడ్డగురికి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారి వెంకటబ్రహ్మం ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల వ్యాప్తంగా 6446 రైతులు లబ్ధిపొందన్నారు. 440.94లక్షలు రైతుల ఖాతాల్లో జమ అయింది. తహసీల్దార్ షెక్షావలి, దివాకర్ పాల్గొన్నారు.

టీస్టాల్‌లో చోరీ



టీస్టాల్ షట్టర్‌ను పగులగొట్టిన దృశ్యం

చిలమత్తూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే 44వ జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్టులో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ టీస్టాల్‌లో చోరీకి పాల్పడ్డారు. ప్రధాన కూడలిలో మంజుల అనే మహిళ టీస్టాల్ నిర్వహిస్తోంది. పక్కనే మెడికల్ అండ్ జనరల్ షాపు ఉంది. చోరీకి పాల్పడిన దుండగులు కారులో వచ్చారు. షాపుల ముందరే కారు ఆపి కారులో నుంచి ఒక వ్యక్తి ఇనుప రాడ్‌తో దిగాడు. మొదట మెడికల్ షాపు షట్టర్ లాక్ ఓపెన్ చేయడానికి ప్రయత్నించాడు. అది సాధ్యం కాకపోవడంతో పక్కనే ఉన్న టీస్టాల్ షట్టర్‌ని తెరిచాడు. లోపల ఉన్న వస్తువులను వేగంగా కారులోకి పెట్టుకున్నాడు. ఇదంతా మెడికల్ షాపు బయట ఏర్పాటుచేసిన సిసి కెమరాలో రికార్డు అయ్యింది. టీస్టాల్ నిర్వహిస్తున్న మంజులమ్మ ఉదయం షాపు తెరవడానికి వచ్చి అప్పటికే షట్టర్ తెరిచి ఉండటం చూసి షాక్ అయ్యింది. లోపలికి వెళ్లి చూడగా అందులో ఉంచుకున్న రూ.30 వేలతో పాటు పింఛన్ సొమ్ము రూ.4 వేలు కనిపించలేదు. రూ.7 వేలు విలువచేసే సిగరెట్ ప్యాకెట్లు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు కన్నీరుమున్నీరైంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 4వార్డుకు చెందిన 31 సంవత్సరాల యువకుడు విషద్రావకం తాగి శనివారం ఆత్మహత్యకుయత్నించాడు. కుటుంబ కలహాల కారణంగా విసద్రావకం తాగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ ఉషా అతనికి చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

రికార్డు అసిస్టెంట్..

చిలమత్తూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): టేకులోడు గురుకుల పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సిద్దలింగప్ప శనివారం పాఠశాలలోనే ఆత్మహత్యకు యత్నించాడు. పాఠశాలలో కొంత కాలంగా ఆయన అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని సిబ్బంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసాద్‌రెడ్డిని విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. శనివారం ప్రసాద్‌రెడ్డి పాఠశాలకు వచ్చి విచారణ చేస్తున్న తరుణంలో సిద్దలింగప్ప అక్కడే విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే సిబ్బంది ఆయనను చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై ప్రిన్సిపాల్ శోభారాణితో మాట్లాడగా ఆయనపై ఫిర్యాదు చేసిన మాట వాస్తవం అని, ఆయన తనపై అధికారులు చర్యలు తీసుకుంటారని భావించి ఆత్మహత్యకు యత్నించి ఉంటాడన్నారు.

కంటైనర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



బోల్తాపడిన కంటైనర్

పెనుకొండ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేకమ్మ గుడి సమీపంలో శనివారం కంటైనర్ అదుపు తప్పిన ఘటనలో డ్రైవర్ గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు పాలసముద్రం నుంచి కియ పరిశ్రమకు అవసరమయ్యే విడిభాగాలను కంటైనర్‌లో తరలిస్తున్నారు. పులేకమ్మ దిన్నె సమీపంలోకి రాగానే డ్రైవర్‌కు మూర్ఛవ్యాధి రావడంతో వాహనం అదుపుతప్పి జాతీయరహదారి పక్కకు ఒరిగిపోయింది. ప్రమాదంలో డ్రైవర్ గాయపడ్డాడు.